

19 వ వసంతంలోకి ...

సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం,26 నవంబర్ 2025

8 పేజీలు


## మంచి చిత్రాలకు ఆదరణ
# ఎప్పుడూ ఉంటుంది







**- కేరళను తలపించే కోనసీమ, గోదావరి జిల్లాలు**
**- నూతన సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు సుభాష్, దుర్గేష్**

**మలికిపురం, మేజర్ న్యూస్ :** సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని, మంచి కథతో సమాజాన్ని జాగృతం చేయవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సినిమాటోఫిగ్రఫీ , పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో రామ్కి ప్రొడక్షన్ నెంబర్ వన్ సౌజన్యంలో తెరకెక్కుతున్న "రాజి" (నో కాంప్రమైజ్ ట్యాగ్‌లైన్) నూతన చలనచిత్ర షూటింగ్ కార్యక్రమంలో ఇరువురు మంత్రులు పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత మలికిపురం చంటి రాజుగారి విల్లాస్ సమీపంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చిత్రంలో హీరోగా రామ్‌కి, రెండవ హీరోగా సందీప్, నటిస్తుండగా, హీరో యిన్‌గా జయశ్రీ బర్మన్ (అస్సాం)

- తరువాయి 2లో..

## రైతు భద్రత కోసం నమ్మకం కోసం
# ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ మంత్రి హామీ**
**- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



**రాజానగరం, మేజర్ న్యూస్ :** రైతుల పట్ల ప్రభుత్వం పూర్తి నమ్మకం నింపి అండగా నిలుస్తూ, పరిపాలనలో మార్పులు నేపథ్యంలో రైతు గుండెల్లో నమ్మకం నింపే విధంగా కూటమి ప్రభుత్వం రైతు ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తోందనీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మంగళవారం రాజానగరం మండలం సంపత్ నగరం లోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ తదితరులతో కలిసి సందర్శించారు. అనంతరం రైతులతో, రైతు సేవా కేంద్రం సిబ్బందితో ముఖాముఖి సంభాషించి వారి నుంచి సంతృప్తి స్థాయి లో వివరాలు తెలుసు కోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేస్తూ, గోనె సంచులు లేకపోవడం, దూరప్రాంత మిల్లులకు లింక్ చేయడం వంటి సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయని తెలియచేశారు. మని మన అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం హయాంలో రైతులకు చెల్లించవలసిన బకాయిలు రూ.1674 కోట్లు, రైస్ మిల్లర్లకు బకాయి పెట్టిన రూ.1100 కోట్లలో. రూ.470 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమై ఉందని, రాజానగరం నియోజక వర్గంలో 1.24 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి నమోదు అయినట్లు వివరించారు. రాజానగరం నియోజక వర్గంలో నే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా "రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం, కొనుగోలు చేసిన నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుంది" అని మంత్రి స్పష్టం

- తరువాయి 2లో..

## త్వరలో రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట
# ప్రభల తీర్థ మహోత్సవం

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్**



**రాజోలు, మేజర్ న్యూస్ :** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే "జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని" రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం చంద్రబాబునాయుడు సమ్మతించారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి కోనసీమ వాసులు ఈ అంశాన్ని తీసుకువచ్చి వినతి పత్రం అందించగా మంత్రి దుర్గేష్ స్పష్టతనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతిని పురస్కరించుకొని ఏటా లక్షలాది మంది భక్తుల కోలాహలం మధ్య

- తరువాయి 2లో..

## నిడదవోలు చరిత్ర చాటేలా
# డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

**- నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 26 నుండి 28 వరకు వేడుకల నిర్వహణ**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** నిడదవోలు చరిత్ర చాటేలా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు జరుగనున్నాయి. నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పడి నవంబర్ 30 వ తేదీకి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో, వివిధ సేవా సంఘాల సహకారంతో నవంబర్ 23 నుండి 28 వరకు వేడుకలు నిర్వహించనున్నారు. అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గోదావరి జలాలు రప్పించే ప్రాజెక్టు, మాలకోడు చెరువు ఆధునికీకరణ, ప్రధాన రహదారులు తదితర రూ.131 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా నిడదవోలు అభివృద్ధిలో భాగస్వాములైన వారిని, నిడదవోలు ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన పలువురిని ఘనంగా సన్మానించనున్నారు. మున్సిపాలిటీ ఏర్పడ్డప్పటినుండి నేటి వరకు పురపాలక సంఘంలో విధులు నిర్వర్తించిన ఛైర్మన్లు, కౌన్సిలర్లను ఘనంగా

- తరువాయి 2లో..

## రైతు పక్షాన ప్రభుత్వం
## - ప్రతి గింజ కొనుగోలు చేస్తాం
# - అభివృద్ధి సంక్షేమం నిరూపిస్తాం

**- మంత్రి నాదెండ్ల మనోహర్**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రైతు పక్షాన నిలబడిందని, రైతుకు అండగా అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతు పండించే ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు & వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం అనపర్తి నియోజకవర్గంలోని, బిక్కవోలు మండలం బలబద్రపురం గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మాయిశ్చర్ శాతం, తేమ ప్రమాణాలను, కొనుగోలు విధానాన్ని మంత్రి ప్రత్యక్షంగా రైతుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల

- తరువాయి 2లో..

# రైతు భద్రత కోసం నమ్మకం కోసంప్రభుత్వం కట్టుబడి ఉంది

మొదటిపేజి తరువాయి

చేశారు. ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నదన్నారు. ఎన్నికల ముందు, 48 గంటల్లో చెల్లిస్తామని చెప్పినా, అధికారం లోకి వచ్చిన తర్వాత 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నా మన్నారు. పంటలకు సాగునీటిని సమృద్ధిగా అందించడంతో రైతులు రెండు పంటలు విజయవంతంగా సాగు చేశారని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తదుపరి వారి నుంచి వేలి ముద్రలు తీసుకున్న రెండు గంటల్లో నగదు జమ చేయడం జరుగు తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, దిశ నిర్దేశం వల్ల రైతులకి ఎంతో ప్రయోజనం చేకూరుతోందని ఆయన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి నాదెండ్ల మనోహర్, తూర్పు గోదావరి జిల్లా రైతులు, అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆదర్శంగా అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 89 వేల మంది రైతుల నుండి 1.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ.430 కోట్లు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు వెల్లడించారు.

తేమ శాతం, గోనె సంచులు, రవాణా వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మూడు నెలలుగా పర్యాయ పరిశీలనతో శిక్షణ ఇస్తున్నామని, తద్వారా రైతుల్లో అవగాహన కల్పించడం జరిగిందనీ తెలిపారు. డిసెంబర్ 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తవుతుంది అని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రుడా చైర్పర్సన్ బొడ్డు వెంకటరమణ, ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్, డి.ఎస్వో వి. పార్వతి, డి.ఎం.సి.ఎస్. బి. గణేష్‌కుమార్, డి.సి.వో ఎం. వెంకటరమణ, డి.సి.సి.బి చైర్మన్ తుమ్మల బాబీ, సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలో మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాల జాతీయ సేవా పథకం మరియు శ్రీ సత్య దంత వైద్యశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలియజేశారు. మహిళలు మరియు బాలికలపై హింసను పరిష్కరించడం, పౌరులను రక్షించడంలో మరియు దీర్ఘకాలిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, మానవ హక్కులు మరియు గౌరవాన్ని నిలబెట్టడానికి మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రతి సంవత్సరం నవంబర్ 25 న నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ " సమాజం ప్రగతి సాధించాలంటే మహిళలను గౌరవించాలని" అన్నారు. నైతిక విలువలతో కూడిన గొప్ప సమాజాన్ని తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ సత్య సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల అధినేత డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని,



హింసాత్మక ఘటనలకు అవకాశం లేకుండా మహిళామూర్తులను రక్షించుకోవాలని అన్నారు. మహిళలపై దాడులను నిర్మూలించాలంటే ప్రభుత్వాలు, చట్టాలు, సామాజిక సంస్థలు, మరియు ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాలని, చట్టాల అమలు, మహిళా భద్రత కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయడం, నేరాలను నివారించడానికి పట్టణ ప్రణాళికలో మార్పులు చేయడం, అలాగే నిందితులకు కఠిన శిక్షలు విధించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# త్వరలో రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట ప్రభల తీర్థ మహోత్సవం

మొదటిపేజి తరువాయి

అంగరంగ వైభవంగా జరిగే జగ్గన్న తోట ప్రభల తీర్థ మహోత్సవానికి ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక మంత్రిగా తాను, సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్ పర్సన్ తేజస్విని పొడపాటి వేర్వేరు సందర్భాల్లో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు సీఎం వెంటనే సమ్మతించారని స్పష్టం చేశారు. ప్రతి ఏటా కన్నుల పండువగా జరిగే ఈ ఉత్సవానికి రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తి పారవశ్యంలో మునిగి తేలుతారన్నారు. ఎన్నో తరాల నుండి సంప్రదాయంగా వస్తోన్న ఈ ప్రభల తీర్థం జరిగే సమయంలో పండుగ వాతావరణం నెలకొని అధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. వీటన్నింటితో పాటు కోనసీమ వాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రులతో పాటు వివిధ రూపాలతో తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని, అదే విధంగా ప్రపంచానికి చాటి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

# నిడదవోలు చరిత్ర చాటేలా డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

మొదటిపేజి తరువాయి

సత్కరించనున్నారు. డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఐ లవ్ నిడదవోలు సెంటర్ దగ్గర ప్రతిరోజు సాయంత్రం 5 నుండి 10 వరకు ఫుడ్ ఫెస్టివల్, ఫ్లవర్ షో, విద్యార్థులకు డ్యాన్స్, క్విజ్, డ్రాయింగ్ కాంపిటీషన్స్, జానపద కళల ప్రదర్శన తదితర వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించను న్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జున రావు గారు రచించిన నిడదవోలు చరిత్రకు సంబంధించిన పుస్తకం అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణంలో ప్రధాన కూడళ్లు, చారిత్రాత్మకమైన ల్యాండ్ మార్క్ లు, టెంపుల్స్, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్లు, వీధులను అందంగా అలంకరించి ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలకనున్నారు. ప్రధానంగా నిడదవోలు పట్టణంలో 5 ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేసి కడియం నర్సరీల నుండి తెప్పించిన పూలతో ఫ్లవర్ షోలు ఏర్పాటు చేయడంతో పాటు పర్యావరణం, ఉద్యానవనంపై అవగాహన కల్పించి ప్రోత్సహించనున్నారు.

నవంబర్ 26న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, నవంబర్ 27న జిల్లా ఇన్ చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు వేడుకలకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వారికి దాదాపు 150 మంది కళాకారులతో ఘనస్వాగతం పలకనున్నారు. నవంబర్ 26న మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలతో పాటు ప్రజలను ఉద్దేశించి ప్రసంగం ఉండనుంది. నిడదవోలు ప్రస్థానాన్ని, ప్రాశస్త్యాన్ని, గత వైభవాన్ని, కూటమి ప్రభుత్వం వచ్చినానంతరం నిడదవోలు లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడనున్నారు. భవిష్యత్తులో నిడదవోలును ఏ రకంగా తీర్చిదిద్దాలో రూపొందించుకున్న సమగ్రమైన ప్రణాళికను వెల్లడించనున్నారు. నిడదవోలు డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఇప్పటికే 16 నవంబర్ న 5కే రన్ అండ్ వాక్ నిర్వహించాం.అద్భుతమైన స్పందన వచ్చింది.దాదాపు 4000 మంది 5కే రన్ అండ్ వాక్‌లో పాల్గొన్నారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో స్థానికంగా చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నిడదవోలు చరిత్ర గురించి వ్యాసరచన, ఉపన్యాస, డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, ముగ్గుల, పాటల, డాన్స్ పోటీలు నిర్వహించారు. 24 నవంబర్ న బాయ్స్ హైస్కూల్ లో కబడ్డీ పోటీలు నిర్వహించారు. నిడదవోలు డైమండ్ జూబ్లీ వేడుకల్లో ప్రజలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక పురపాలక సంఘం పిలుపునిచ్చింది.

## మంచి చిత్రాలకు ఆదరణ ఎప్పుడూ ఉంటుంది

మొదటిపేజి తరువాయి

తొలిసారిగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకునిగా గెద్దాడ ప్రసాద్ కాగా, ప్రముఖ నటులు రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జబర్దస్త్ టీం నుంచి జూనియర్ ఆర్టిస్టులు నటిస్తున్నారు. అనంతరం మంత్రులు వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్ లు మాట్లాడుతూ సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఎల్లప్పుడూ ఆదరిస్తారన్నారు. ఇంటిల్లిపాది సంతోషంగా చూసే సినిమాలు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా కేవలం కథ కాదని ప్రేక్షకులను ఆలోచింపజేసే ప్రయత్నంగా ఉండాలన్నారు. ప్రతి సినిమా ఒక కొత్త ప్రయాణమని, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవాలని ఆశిస్తున్నామన్నారు. కేరళను తలపించే కోనసీమ, గోదావరి జిల్లాల అందాలు చలనచిత్ర షూటింగ్‌లకు అనుకూలమని అన్నారు. కార్మికులకు సోషల్ సెక్యూరిటీ కోడ్ అమలు చేస్తామన్నారు. సోషల్ సెక్యూరిటీ కార్మికుల జీవితాలకు భరోసాగా నిలుస్తుంది అన్నారు. అనంతరం మంత్రులు రామ్‌కి ప్రొడక్షన్ నెంబర్ వన్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, చలనచిత్ర నటీనటులు, కాంగ్రెగుల రాము తదితరులు పాల్గొన్నారు.

## రైతు పక్షాన ప్రభుత్వం - ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

### - అభివృద్ధి సంక్షేమం నిరూపిస్తాం - మంత్రి నాదెండ్ల మనోహర్

మొదటిపేజి తరువాయి

నుండి దాన్ని కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తుందని అన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గారి తండ్రి స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డి వారితో మా నాన్నకి ప్రత్యేక అనుబంధం ఉందని, ఆ నేపథ్యంలో వారి కుటుంబం గురించి నాకు లోతైన అవగాహన ఉందని , ఒక తపనతో పని చేసే నాయకుడు రామకృష్ణారెడ్డి అని అన్నారు. గతంలో కొందరు మిల్లర్లు నిర్లక్ష్యం కారణంగా రైతులకు ఇబ్బందికర పరిస్తితులకు ఏర్పడ్డాయని, ఈసారి ధాన్యం రవాణా నుంచి బిల్లింగ్ వరకు ప్రతి దశలోనూ కఠిన నియమా అమలు చేస్తున్నట్లు మంత్రి అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదని , గత ప్రభుత్వంలో చేతకాని పాలనతో రైతులను నానా ఇబ్బందులు పెట్టారని , ఏ రైస్ మిల్లుకు విక్రయించాలో ఎంత రేటు పెట్టాలో వారే చెప్పేవారని , చివరకు సంచుల కోసం కూడా రైతులు ధర్నాలు చేసిన పరిస్థితిని నాడు మనం చూసామని అన్నారు. నాడు ఈ ప్రాంతం పర్యటించినప్పుడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మేము, అందరం రైతుల బాధలు చూసామని అందుకే రైతులకు ఏ ఇబ్బంది ఉండకూడదని పారదర్శకంగా ధాన్యం కొనుగోలు వ్యవహారం ఉండాలని అనేక సంస్కరణలు ఇప్పుడు తీసుకొచ్చామని అన్నారు. జిల్లాలో ఆరు రోజులపాటు రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం రాష్ట్ర పర్యటన చేస్తూ, ప్రజలకు, రైతులకు అవసరమైన చర్యలు తీసుకునందుకు రాష్ట్ర ప్రభుత్వంతోనూ, కేంద్ర ప్రభుత్వం తోనూ చర్చలు జరిపి ఎవ్వరికి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా పరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఈ రోజున రైతు ధాన్య విక్రయించిన 24 గంటల్లో రైతు ఖాతాలోకి సొమ్ములు జమ అవుతున్నాయంటే అది మంత్రి వారి చొరవతోనే జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, ఇది రైతు ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డి ఓ ఆర్ కృష్ణ నాయక్, డీఎస్ఓ వి ఎం పార్వతి, డి ఎం సి ఎస్ బి. గణేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషన్ చైర్మన్ టి. సుధీర్, ఇతర అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుబ్రమణ్య షష్టికి ఏర్పాటు పూర్తి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** తాళ్లూరు గ్రామంలోని వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ తెలిపింది. రాజమహేంద్రవరానికి చెందిన శిష్ట వెంకటరమణమూర్తి పద్మలత దంపతులచే బుధవారం సాయంత్రం కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. స్వామివారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కనులు మిరమిట్లు కోల్పోయిన విద్యు త్ కాంతులతో దేవాలయం ప్రకాశిస్తోంది. కళ్యాణ మహోత్సవానికి పందిరిని గ్రామానికి చెందిన రైతు నిర్మించారు. దేవత విగ్రహాలను అత్యంత శోభాయమానంగా అర్చకులు వెలవలపల్లి సత్యనారాయణమూర్తి అలంకరించారు.

# రంపచోడవరం కేంద్రంగా 'పోలవరం' కొత్త జిల్లా!




### – ముఖ్యమంత్రి ప్రకటనపై సర్వత్రా హర్షం

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : ఎట్టకేలకు ప్రభుత్వం రంపచోడవరం కేంద్రంగా 'పోలవరం' కొత్త జిల్లాను ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా ఆనందాలు వ్యక్తం అవుతున్నాయి. దశాబ్దాల కాలంగా రంపచోడవరం ఆదివాసీ ప్రత్యేక జిల్లా ఏర్పాటు కోసం మన్యవాసులు ఎదురుచూస్తున్నారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉండే రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లు పరిధిలోని 11 గిరిజన మండలాలను గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు) లో కలపడంతో అప్పటినుండి ఈ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతర ప్రజల కష్టాలు మొదలయ్యాయని చెప్పవచ్చు. జిల్లా కేంద్రం పాడేరు రంపచోడవరంతోపాటు చింతూరు డివిజన్ పరిధిలోని విలీన మండలాలకు సుమారు 200 నుండి 350 కిలోమీటర్ల దూరంలో ఉండడంవల్ల ప్రజలు వారి సమస్యలపై జిల్లా కేంద్రం పాడేరు రాకపోకలు సాగించలేక నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పోలవరం ముంపు ప్రాంతాల ప్రజలు వారి ఇబ్బందులు, సమస్యలు అధికారులకు తెలియజేయడానికి అవకాశం లేక రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు జిల్లా కేంద్రం ఆదివాసీ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా రంపచోడవరం కొత్త జిల్లా ప్రకటించాలని కోరుతూ కొన్నాళ్ల క్రితం ఈ ప్రాంతంలో గిరిజన సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రత్యర్థ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు ఉద్యమాలు చేయడం జరిగింది. అలాగే జిల్లా పరిధిలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు సైతం పరిపాలనాపరంగా రంపచోడవరం జిల్లా అవసరాన్ని తెలియజేస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగింది.

కాగా గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు రంపచోడవరం నియోజవర్గం పరిధిలోని చింతూరు ప్రాంతానికి ఎన్నికల ప్రచారానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రంపచోడవరం ఆదివాసీ జిల్లా ప్రకటిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అప్పటినుండి మరలా ఏజెన్సీ, విలీన మండలాల ప్రజలు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు కొత్త జిల్లా ఏర్పాటు చేస్తే తప్ప తమకు న్యాయం జరగదని ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ రాష్ట్ర మంత్రులతో ఉప కమిటీ ఏర్పాటు చేసి కొత్త జిల్లాల ఏర్పాటు, పునర్విభజనలో సవరణలపై నివేదిక ఇమ్మని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసారు. అయితే మంత్రులు కమిటీ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించకుండానే కొత్త జిల్లాలు, డివిజన్ల పై ప్రభుత్వానికి నివేదిక అందించడంతో ముఖ్యమంత్రి సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు కొత్త జిల్లాల ఏర్పాటుపై మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో జిల్లాల పునర్విభజన పై సమీక్షా సమావేశాలు నిర్వహించిన అనంతరం కొత్తగా మూడు జిల్లాలను ప్రకటించారు. మార్కాపురం మదనపల్లెతో పాటు రంపచోడవరం కేంద్రంగా పోలవరం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంతో గిరిజన ప్రాంతాలలో ఆనందం వెల్లువెత్తింది. కొత్త జిల్లాలో రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాలు చింతూరు డివిజన్ పరిధిలోని 4 మండలాలు తోపాటు పోలవరం నియోజకవర్గం పరిధిలోని మండలాలు కలిపి కొత్త జిల్లా అవతరించనుంది. పోలవరం ప్రాజెక్ట్ పరిధిలోని ముంపు ప్రాంతాలన్నీ దాదాపు కొత్త జిల్లా పరిధిలోకి రానున్నాయి. ముంపు మండలాలకు రంపచోడవరం దగ్గరగా ఉండడం వల్ల గిరిజనులకు వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు, పరిపాలనాపరంగా ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. రంపచోడవరం ప్రత్యేక జిల్లా కోసం స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డితో పాటు అనేకమంది ఈ ప్రాంతానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం రంపచోడవరం (పోలవరం) కొత్త జిల్లాపై ప్రకటన చేయడం విశేషం.

**తాలూకా కేంద్రం నుండి జిల్లాగా..**

రంపచోడవరం.. బ్రిటిష్ కాలం నుండి తాలూకా కేంద్రంగా ఉన్న రంపచోడవరం 1987 వ సంవత్సరంలో రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మండల కేంద్రంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెవెన్యూ డివిజన్ గా చాలా కాలం ఉన్న రంపచోడవరం గత ప్రభుత్వం చేసిన జిల్లాల పునర్విజనలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేరింది. మరలా తెలుగుదేశం (కూటమి) ప్రభుత్వ హయాంలోనే జిల్లాగా రూపాంతరం చెందుతుండడం విశేషం. రాజమండ్రి – భద్రాచలం ప్రధాన రహదారిలో ఉన్న రంపచోడవరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నా, పరిపాలనాపరమైన సమస్యలతో సతమతమవుతుంది. అటవీ, జల వనరులు పుష్కలంగా ఉన్న రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతం జిల్లాగా అవతరించి, పరిపాలనాపరమైన సమస్యలను అధిగమించి అభివృద్ధి చెందాలని పలువురు కోరుకుంటున్నారు. గోదావరి నదిపై జాతీయ ప్రాజెక్ట్ పోలవరం పూర్తయితే పోలవరం నియోజకవర్గం పరిధిలోని గిరిజన ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రానికి రాకపోకలు తగ్గించడానికి వీలుగా ఉంటుంది. అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో అమల్లో ఉన్న గిరిజన చట్టాలు అభివృద్ధికి ఆటంకం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

## క్షేత్రస్థాయి సందర్శనతో విద్యార్థులకు అవగాహన

### –పిఠాపురం మండల విద్యాశాఖ అధికారి జి.శ్యాంబాబు



**పిఠాపురం, మేజర్ న్యూస్** : ప్రభుత్వ కార్యాలయాలు సందర్శన పిల్లలకు తమ భవిష్యత్తుపై ఒక నిర్దేశిత నిర్ణయాన్ని తీసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రభుత్వ కార్యాలయాల సందర్శన పర్యటనను మార్గదర్శకంగా తీసుకొని ఉన్నత స్థాయికి విద్యార్థులు చేరాలని పిఠాపురం మండల విద్యాశాఖ అధికారి జి శ్యాంబాబు అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20వరకు పూర్తి చేసుకున్న సందర్భంగా... ఎక్స్‌పోజర్ సందర్శన లో చురుకుగా పాల్గొన్న ముగ్గురు విద్యార్థులను మండలం నుండి గుర్తించి వారికి ఈ నెల 24వ తేదీన కాకినాడ కలెక్టరేట్ నందు కొల్లి సుశాంత్, లాలం షణ్ముఖప్రియ రొంగల సత్యాంబికలను అసిస్టెంట్ కలెక్టర్ మనీషా అభినందించి సర్టిఫికెట్స్ మరియు మెమెంటోస్ అందజేశారు. జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో... ఐసిడిఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు విద్యాశాఖ సంయుక్తంగా అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఈ నెల అనగా నవంబర్ 7వ తేదీన పిఠాపురం ఆర్ బి హెచ్ ఆర్ ఉన్నత పాఠశాల నుండి ఒకరోజు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిఠాపురం ఆర్ఆర్ బిహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాల నుండి ఎంపిక చేయబడిన 13 మంది విద్యార్థులను క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమానికి సంభందిత అధికారుల సమక్షంలో ఉమర్ అలీషా ఉద్యానవనం, పిఠాపురం రూరల్ ఎంపీడీవో కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, ఎన్ఆర్ఇజిఎస్, ఐసిడిఎస్ ఆఫీస్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మరియు పాడా కార్యాలయాలను సందర్శించారు. ఈ ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు అందుతున్న సేవలు గురించి ప్రతీ కార్యాలయంలోని ప్రభుత్వ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్.ఎస్.కె దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గా రాణి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను అధికారులు దిగ్విజయం చేయాలి

### – జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, మేజర్ న్యూస్** : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను మినిట్ టూ మినిట్ అధికారుల సమన్వయంతో దిగ్విజయం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళ వారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించి ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు, పర్యటన నిర్వహణ తీరును క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన విధులు బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా పర్య టనను విజయవంతం చేయాలన్నారు. ఉపముఖ్యమంత్రి స్థాయిలో స్టార్ హీరో పవన్ కళ్యాణ్ జిల్లాకు మొట్టమొదటిసారిగా విచ్చేయడం జరుగుతుందని, జన సైనికులు, అభిమానులు పూర్తి సంయమనం పాటిస్తూ పర్యటన ఆద్యంతం సజావుగా జరిగేలా సహకరించాల న్నారు. ఉపముఖ్యమంత్రి స్థానికంగా ల్యాండ్ అయినప్పటి నుండి తిరిగి మళ్ళీ టెక్ ఆఫ్ అయ్యే వరకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆ ప్రకారం అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పల్లె పండుగ 2.0 రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## జనసేన కార్యకర్త కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్ అందించిన నాగబాబు



**పెరవలి,మేజర్ న్యూస్** : నల్లాకుల వారిపాలెం గ్రామానికి చెందిన జన సేన క్రియాశీలక సభ్యుడు నల్లాకుల వెంకట నరస య్య ఇటీవల రోడ్డు ప్రమా దంలో మరణించిన సం గతి తెలిసిందే. జన సేన సభ్యత్వం వల్ల వచ్చిన ఐదు లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ చెక్కును నరసయ్య కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ నాయకుడు కొణిదల నాగబాబు చేతుల మీదగా మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి అండగా నిలిచిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు నాగబాబుకు నిడదవోలు శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు స్థానిక జనసేన నాయకులకు నరసయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## భవిత కేంద్రం నందు ఫిజియోథెరపి సేవలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్** : పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఎంఇఓలు ఈరంకి ప్రభాకరశర్మ, వి.ఆర్.కె. చౌదరిల పర్యవేక్షణలో సమగ్ర శిక్షా ద్వారా నడపబడు తున్న భవిత కేంద్రం నందు మంగళవారం విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలు నిర్వహిం చారు. దీనిలో భాగంగా భవిత, సహిత ఉపాధ్యాయులు తెలుపుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లలు 3 నుండి 18 సం.ల వయసు గల (శారీరక వైకల్యం కలిగిన) పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని భవిత ఉపాధ్యాయులు తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యా యులు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, మహాత్మా గాంధి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మశ్రీ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు తరలి రండి






- బూర్జువా పార్టీలకు ప్రత్యామ్నాయం ఎర్రజెండా పార్టీలే
- కాకినాడ జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశంలో గుజ్జుల ఈశ్వరయ్య
- ఈశ్వరయ్య రాక సందర్భంగా కాకినాడలో ప్రదర్శన

**కాకినాడ, మేజర్ న్యూస్ :** సిపిఐ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన ఖమ్మం పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్రంలో పార్టీ శ్రేణులకు తరలి రావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు.

మంగళవారం ఉదయం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి కె.బోడకొండ అధ్యక్షతన జరిగింది. అంతకముందు స్థానిక ఆనంద భారతి గ్రౌండ్ నుండి పార్టీ శ్రేణులు ప్రదర్శనగా బయలు దేరి ఎన్జీఓం వరకు వెళ్ళారు. ఈశ్వరయ్య ప్రసంగిస్తూ, పార్టీ శతాబ్దిక పోరాట గాథలు, కార్మిక-రైతు ఉద్యమాల్లో చేసిన త్యాగాలను స్మరించుకునే విధంగా భారీ ఎత్తున ప్రజలను సమీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు, ప్రజాసంఘాలు, కార్మిక వర్గాలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఈశ్వరయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువత, రైతులు, విద్యార్థులగానికి చేసిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పినా రెండు సంవత్సరాలు గడిచినా ప్రభుత్వం దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఒక రూపాయి కూడా కేటాయించకపోవడం పేదలపై తెరచాప ద్రోహమని అన్నారు. కనీసం ఇప్పటికే కట్టిన టిడ్కో ఇళ్లు అయినా వెంటనే స్వాధీనం చేసి పేదల చేతికి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రోజుకు 14 గంటల పని వంటి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించడం కొత్త బానిసత్వపు వైఖరి అని ఈశ్వరయ్య మండిపడ్డారు. కార్మికులు దీర్ఘకాల పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ కార్మిక చట్టాల ఉల్లంఘనకుగానీ, కార్మికులకు ఎక్కువ గంటలు పనిచేయించే వ్యవస్థకుగానీ సిపిఐ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన లోకేష్ బాబుపై విమర్శలు గుప్పించారు. విదేశీ పర్యటనలు పెడుతూ పెట్టుబడులు వస్తున్నాయని ప్రచారం చేస్తున్నా, రాష్ట్రంలో ఒక్క పెద్ద పరిశ్రమ అయినా ప్రారంభమైందా? ఒక్క కొత్త ప్రాజెక్టు వచ్చిన ఆధారం ఉందా? అని ఈశ్వరయ్య ప్రశ్నించారు.

సిపిఐ శతాబ్ది మహాసభ ఖమ్మం నుంచి రాష్ట్ర రాజకీయాలకు, ప్రజాసమస్యల పరిష్కారానికి కొత్త దిశానిర్దేశం ఇవ్వనున్నదని గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. కార్పొరేట్ల పాలనకు ప్రజల ప్రత్యామ్నాయంని వెతుకుతున్నారని, ఎర్రజెండా పార్టీలే ప్రత్యామ్నాయం అని ఆయన గుర్తు చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ సహజ వనరులను బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి నెట్టివేస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాల్సిన అవసరం అత్యంత అత్యవసరమైందని పేర్కొన్నారు. కగార్ ఆపరేషన్ పేరుతో సహజ వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు.

ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు, పప్పు ఆదినారాయణ, శాఖ రామకృష్ణ, ఏ.భవాని, సీపీఐ సీనియర్ నాయకులు కిర్ల కృష్ణారావు, చింతపల్లి సుబ్బారావు, మునిసిపల్ కిషోర్, టీ.అన్నవరం, రైతు సంఘం జిల్లా నాయకులు నక్క శ్రీనువాస్‌రావు, కొమర్తి శ్రీను, కేశవరపు అప్పలరాజు, చింతపల్లి సుబ్బారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.బాబీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.స్టాలిన్, బిట్టు, లక్ష్మి నారాయణ, ప్రజానాట్యమండలి మాడగల రమణ, జట్ల సంఘం పి.త్రిమూర్తులు, రామకృష్ణ, కుమారి, లోవరత్నం తదితరులు పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయ ఉద్యాన, పశుసంవర్ధక రంగాల్లో ఆర్థికంగా ఎదగాలి

- ఆర్‌వైఎస్ఎస్ బాబురావు నాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రైతులు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక రంగాలన్నింటిలో ఆర్థికంగా ఎదగాలని ఏపీ సి ఎన్ ఎఫ్ ఈ డి (ఆర్ వై ఎస్ ఎస్ )బాబు నాయుడు అన్నారు. మండలంలోని శరభవరం గ్రామపంచాయతీకి చెందిన వంకరాయి గ్రామంలో సర్పంచ్ లోత రాజ్యలక్ష్మి అధ్యక్షతన రైతన్న నీకోసం కార్యక్రమంకు ఆర్ వై ఎస్ ఎస్ బాబూరావునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతన్న నీకోసం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేను రైతు బిడ్డనే అని తెలియజేస్తూ మీతో నేను కలిసి నడవడానికి,మీకు అండగా ఉంటానని పాడి పంటలురైతు యొక్క నినాదం కావాలని, నీటి భద్రత డిమాండ్ ఆధారిత పంటలు ఆధునిక పనిముట్లతో వ్యవసాయం ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా పాడి రైతులకు అండగా సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా ఎదుగుదలకు ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాఏపీ సీఎన్ఎఫ్ - డిపిఎం భాస్కర రావు మాట్లాడుతూ పల్లెల్లో ఉండే ఆదాయం పల్లెలోనే ఉండాలి, పట్టణ ప్రాంత ఆదాయం పల్లెలకు రావాలని, ఇది ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వలనే సాధ్యమవుతుందని రైతులను, ఎస్ హెచ్ జి సభ్యులను ఉద్దేశించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ చైర్మన్ లోత లక్ష్మణ రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో కషాయాలు, సహజ ఎరువులైన ఘన, ద్రవ జీవామృతాలు వాడి రైతులు వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని తద్వారా మెరుగైన ఆదాయం తీసుకోవాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్ పీ మంగా రత్నం, సి ఆర్ పి ఎస్ రామస్వామి,నాగరాజు, రాము, రైతులకు సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయ ఇన్పుట్స్ తయారు చేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి ఏ ఏసంధ్య, వీఆర్ఓ మురళి, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు.

## జనసేన పార్టీ క్రియాశీలక ప్రమాద భీమా చెక్ అందజేత



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఉప్పలపాడు గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు (కొండ) ప్రమాదంలో మృతి చెందాడు.మంగళగిరిలో ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చేతుల మీదుగా మృతుడి కుమారుడు అయిన తాతబ్బాయి కి జనసేన పార్టీ క్రియాశీలక ప్రమాద బీమా చెక్ ను అందజేశారు. జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సూచనల మేరకు ఉప్పలపాడు గ్రామానికి చెందిన సత్తి సోమరాజు బాధ్యత తీసుకుని ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్స్ స్వయంగా మా దగ్గరకు తిరిగి,జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వారికి పంపించి మంజూరు చేయించినట్లు తాతబ్బాయి తెలియజేశారు. తుమ్మలపల్లి రమేష్ కు, సత్తి సోమరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన క్రియా వాలంటీర్ మింగి వెంకట సత్యనారాయణ (శ్రీను), జనసైనికులు అడబాల వీరబాబు, మద్దూరి రమణ, ఎద్దు శ్రీను, కాటుమల్ల నాగేంద్ర, పాల్గొన్నారు.

## రూ.2 కోట్ల 20 లక్షలతో బిటి రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**గండేపల్లి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మంగళవారం గండేపల్లి మండలంలోని సింగరం పాలెం నుండి కనుపూరు వరకు కోటి 20 లక్షలతో బీటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మురారి నుండి కలవచర్ల వెళ్లే బీటీ రోడ్డు కోటి రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ సింగరం పాలెం కనుపూరు, మురారి కలవచర్ల బీటీ రోడ్డు శంకుస్థాపన నిర్వహించామని తొందరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని గోకవరం నుండి తిరుమలాయపాలెం, కనుపూరు, సింగరంపాలెం, గండేపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని మహిళలు కోరడం జరిగిందని బస్సు కూడా తొందరలోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ, జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, అక్కిన సుదర్శన్ రావు, గోరిజాల వెంకన్న దొర, ఉండవల్లి బుల్లి రాజు, గద్దె అబ్బన్న, గల్లా రాము, గొల్లవిల్లి శ్రీదేవి, కాంట్రాక్టర్ ధర్మాజీరావు, ఆర్ అండ్ బి జె తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28వ తేదీన ఉచితంగా ఉద్యమ ఆధార్ కార్డులు నమోదు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** కలెక్టర్ షణ్మోహన్ ఆదేశానుసారం గండేపల్లి మండలంలోని అర్హులైన లబ్ధిదారులకు ఈనెల 28వ తేదీ న ఉచితంగా ఉద్యమ ఆధార్ కార్డులు నమోదు చేయబడునని వెలుగు ఏపిఎం ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రకటనలో మాట్లాడుతూ మండలంలోని చిరు వ్యాపారస్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యమ ఆధార్ కార్డులు నమోదు చేయించుకోవాలని కోరారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సబ్ డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, డివిజన్ స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో డీఐఓ డా.కె.వి. సుబ్బ రాజు మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 115 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, చేసి ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.

నవంబర్ నెలలో 3 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 24 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. శ్రీ కైరా ఎమర్జెన్సీ ట్రామా కేర్ సెంటర్, కాకినాడ, కాకినాడ ఒయాసిస్ ఫెర్టిలిటి సెంటర్ వారు న్యూ రిజిస్ట్రేషన్ కొరకు, కాకినాడ కీర్తి స్కాన్ సెంటర్ వారు రెన్యువల్ కొరకు, కాకినాడ మెడ్ వే సంజీవి హాస్పిటల్ యాడింగ్ అఫ్ మెషిన్, చేంజ్ ఆఫ్ ఎంప్లాయ్ కొరకు మరియు సృజన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, కాకినాడ వారు చేంజ్ ఆఫ్ ఎంప్లాయ్ కొరకు నమోదు చెయ్యడం జరిగినది. ఈ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటి ఆమోదం తర్వాత డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీకి పంపడం జరుగుతుందన్నారు. తదుపరి వారి అనుమతితో సంబంధిత యాజమాన్యం వారికి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తగా గర్భిణీ స్త్రీ గృహాలను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు.

జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమ చారము లేక నమోదు కానీ స్కానింగ్ కేంద్రాలు మరియు అర్హత లేని వైద్యులు వివరములు టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3365 మరియు వాట్సప్ నెంబర్ – 9494113365కు తెలియ చేయవలసిందిగా ఆయన కోరారు. సమావేశంలో జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి.హరిత, వన్ టౌన్ సి.ఐ పి.స్వామి నాయుడు, పిఠాపురం సీహెచ్సీ డా. చందన, హెల్త్ ఎడ్యుకేటర్లు విజయ లక్ష్మి, రాంబాబు, కృష్ణ శేఖర్, ఎల్.శృతి మోనిటరింగ్ కాన్సలెటెంట్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెరవలి పీహెచ్సీలో కన్వర్జెన్సీ మీటింగ్



**పెరవలి, మేజర్ న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరవలిలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 25వ తేదీ మంగళవారం వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్ అధ్యక్షతన అంగనవాడి కార్యకర్తలతో ఆశా వర్కర్లతో కన్వర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ ఇకనుండి ప్రతి మంగళవారం ఈ మీటింగుకు క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది , సూపర్వైజర్లు మరియు అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది, సూపర్వైజర్లు పాల్గొనాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరవలిలో మీటింగ్ ఏర్పాటు చేసి, ఇందులో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలందరికీ రానున్న పది రోజులలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఎత్తు, బరువు ప్రతినెల గుర్తించుట, మరియు పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి తగిన పోషకాహారం అందేటట్లు, ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకోనుట గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజనాల ప్రసాద్, హెల్త్ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, సూపర్వైజర్ హసీనా పాల్గొన్నారు.

# ప్రత్తిపాడులో రైతన్న మీకోసం



–ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

–మైనర్ ఇరిగేషన్ పిడి వరప్రసాదరావు

**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి రైతులు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని ఏపీ మైనర్ ఇరిగేషన్ పిడి జివివి ప్రసాదరావు అన్నారు. మంగళవారం ప్రత్తిపాడు మండలంలో రైతన్న నీకోసం కార్యక్రమంలో ప్రతిపాడు గ్రామంలో రైతున్న మీకోసం కార్యక్రమంలో ఏపీఎంఐపి పిడి జీవివి ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో ఏపిఎంఐపి కార్యక్రమం అలాగే ఇతర శాఖల పథకాలు, పంట వైవిధ్య ప్రయోజనాలు మొదలైన వాటి గురించి వివరించారు. జగ్గంపేట, ఏలేశ్వరం మండలాల్లోని రామవరం, బూరుగుపూడి, పెరవరం గ్రామాలలో డ్రిప్ వ్యవస్థ యాదృచ్ఛిక తనిఖీలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


## మర్రివీడిలో రైతన్న.. మీకోసం..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం మర్రివీడులో మండల వ్యవసాయ అధికారి ఏ వి.రాజేష్, మండల ఉద్యానవన శాఖ అధికారి కె.దివ్య శ్రీ ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు గొల్లపల్లి నరసింహమూర్తి హాజరైయ్యారు.

గ్రామ నాయకులతో కలిసి గ్రామ రైతుల ఇంటి వద్దకు వెళ్లి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను రాబోయే ఐదు సంవత్సరాలలో రైతునే రాజుగా చేయడానికి సంకల్పం చేసుకున్నారని దానిలో భాగంగా ఐదు ప్రధాన అంశాలను గూర్చి ఈ రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రోసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులకు సబ్సిడీపై విత్తనాలు, యంత్ర పరికరాలు, డ్రోన్స్, సూక్ష్మ నీటి పారుదలకు సంబంధించి డ్రిప్, స్ప్రింకర్ పైపులను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే రైతుల కోసం ఏపీ ఎయిమ్స్ రైతు యాప్ ను రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని రైతులు ఈ యాప్ నందు రిజిస్ట్రేషన్ అవ్వడం ద్వారా ప్రస్తుత వాతావరణ పరిస్థితి, మార్కెట్ కి సంబంధించిన ధరలు, ముందస్తు చీడపీడల పరిస్థితి, పంటనమోదు వివరాలు, పంట నష్టం వివరాలు రియల్ టైంలో
తెలుసుకోవచ్చున్నారు. ఇతర వ్యవసాయ ఆధారిత వీడియోలు వీక్షించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి పెట్టాలని తద్వారా తమ పంటలకు నాణ్యమైన దిగుబడితో పాటుగా ఇంటర్నేషనల్ స్థాయి గుర్తింపు రావడంతో ఆర్థికంగా మరింత బలపడవచ్చని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రవికుమార్ వర్మ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ.నిఖిల్ టిడిపి నాయకులు నీలి సత్యనారాయణ. బుచ్చి అప్పలరాజు, సిరిపురపు శ్రీను,గ్రామ కూటమి నాయకులు, వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై హింస నిర్మూలన అనే అంశంపై చిత్రలేఖనం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ & పి.జీ కళాశాలలో విద్యార్థినులు మహిళల హక్కుల పరిరక్షణ మరియు హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు చిత్రాలు వేసారు అని కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥బి.యి.వి.యల్. నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 25న మహిళలపై హింస నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహిస్తారు అని తెలియజేశారు. నేటి సమాజములో స్త్రీలు అనేక సామాజిక, ఆర్థిక, గృహ హింస, స్త్రీలపై అత్యాచారాలు ఎక్కువ అవుతున్నాయి. వీటన్నింటినీ అరికట్టే ప్రయత్నములో 1999 డిసెంబరు 17వ తేదిన ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానాన్ని చేసింది అని తెలియజేశారు.

ఆదిత్య మహిళ డిగ్రీ & పి.జి కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము నవంబరు 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినము పాటించాలని తేలియజేశారు.
చారిత్రాత్మకంగా ఈ దినాన్ని 1960లో డొమైన్ రిపబ్లిక్‌లో రాజకీయ కార్యకర్తలైన మిలాబల్ సిస్టిర్స్ యొక్క హత్య ఆధారంగా స్త్రీ హింసా వ్యతిరేక దినంగా పాటించడం జరిగింది అని తేలియజేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి. నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉద్యమకారులు నవంబరు 25న హింసా వ్యతిరేకత గూర్చి అవగాహన కల్పించుటకు నిర్ణయించారు. 1999 డిసెంబరు 17న ఈ దినాన్ని అధికారికంగా ఐక్యరాజ్యసమితి తిర్మానించింది అని తెలియజేశారు.ఈ సందర్భంగా ఆదిత్య మహిళ డిగ్రీ & కళాశాల విద్యార్థినులు మహిళల పరిరక్షణ మరియు మహిళల హింసకు వ్యతిరేకంగా పోరాడేందుకు చిత్రాలు వేసారు. చిత్రాలు వేసిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. బాగా చిత్రాలు వేసిన విద్యార్థినులకు బహుమతి అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫిసర్ ఎమ్.శ్రీనువాస్‌రావు, అసిస్టెంట్ ప్రొగ్రాం ఆఫీసర్ కె.నవ్య మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# కొత్త జిల్లా ప్రకటనపై ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్** : రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు పై రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గ ఉప సంఘానికి ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి కృతజ్ఞతలు తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అమలు చేసారన్నారు. రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి ఛైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల మార్పులపై సమీక్ష నిర్వహించారన్నారు. దీనిలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో రంపచోడవరం కేంద్రంగా మరో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చిందని, ఈ క్రమంలో పరిమిత స్థాయిలోనే మార్పులు, చేర్పులు ఉండాలని ఆయన స్పష్టం చేశారని, రంపచోడవరం, చింతూరు డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపకుండా కొత్త జిల్లా ఏర్పాటు చేయడమే మంచిదని మంత్రివర్గ ఉప సంఘానికి సీఎం సూచనలు చేశారు. ఈ మేరకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకి మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం చేయటం శుభపరిణామమన్నారు. దీని విషయంలో గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాదయాత్రలో పోలవరం సమావేశంలో ప్రత్యేక జిల్లా ఏర్పాటుపై ప్రకటన చేసి, నేడు నెరవేర్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రైతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే రాజప్ప



**సామర్లకోట, మేజర్ న్యూస్** : రైతులకు అండగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం సామర్లకోట నీలమ్మ చెరువు వద్ద రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొన్నారు. రైతన్నను రాజును చేసేందుకు నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు అనే 5 అంశాలపై ప్రభుత్వం దృష్టి సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజా సూరిబాబు రాజు,యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, రైతు సంఘం నాయకులు కంటే జగదీష్ మోహన్ బాబు, బడుగు శ్రీకాంత్,అందుగుల మణికుమారి జార్జి చక్రవర్తి, పైన్నీ శ్రీనివాస్,అడబాల కుమారస్వామి, పిట్టా జానకి రామారావు, నూనె రామారావు, బలుసు వాసు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# శంఖవరం సుబ్రహ్మణ్యేశ్వరుడు వరుడాయెనె ...!





**– భక్తులకు కనువిందు చేసిన పాల కావడి ఉత్సవం**



**శంఖవరం, మేజర్ న్యూస్** : కుమారస్వామి సర్పరూపంలో భూలోకానికి ఈ మార్గశిర శుద్ధ షష్టి నాడు అడుగు పెట్టిన రోజు సుబ్రహ్మణ్య షష్టిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ అలాగే ఈ మార్గశిర శుద్ధ షష్టి నాడే దేవసేనతో సుబ్రహ్మణ్య స్వామికి వివాహాన్ని దేవేంద్రుడు జరిపించాడు. అందుకనే ఈ రోజును సుబ్రహ్మణ్య షష్టి అని జరుపుతారు. ఈ రోజు హిందువులకు అత్యంత పవిత్రమైన, ప్రాముఖ్యమైన దినం. దీంతో ఈ మంగళవారం అన్ని చోట్ల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాలు పెండ్లి వేడుకలకు ముస్తాబు అవుతున్నాయి. ఈ క్రమంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి, అమ్మ వార్లను పెళ్లి కుమారుడు, పెళ్ళి కుమార్తెలుగా అలంకరించి వివాహానికి అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసారు. షష్టి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. బొండా ఫణీంద్ర, రమ్య దంపతుల చేత గణపతి పూజతో ప్రారంభించి ఉత్సవమూర్తులకు పుణ్యాహవచనం, రక్షాబంధన ధారణ, విశేష పూజలను ఆలయ అర్చకులు చదువుల సాయికుమార్ శర్మ నిర్వహించారు. ఈ సిద్ధపాటు కార్యక్రమానికి హాజరైన ముత్తయిదువులు అందరూ బుధవారం జరిగే స్వామి, అమ్మవార్ల వివాహ వేడుకను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముత్తైదువు లకు తాంబూలాలను ఫణీంద్ర, రమ్య దంప తులు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో పాల కావి ళ్ళతో ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని నిర్వహించి భక్తులు, ప్రజలకు కనువిందు చేశారు. ఈ గ్రామోత్సవం అనంతరం భక్తుల సమక్షంలో మూలవిరాట్ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహి ంచారు. నీరాజనం, మంత్ర పుష్పాలతో స్వామి, అమ్మ వార్లను అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. బొండా జగదీష్, రాణి దంపతులు చేతుల మీదుగా భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి ప్రధానకర్త, ప్రోత్సాహకులు దాసరి లోవరాజు మాట్లాడుతూ 26 న బుధవారం షష్టి పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తులు అందరికీ మధ్యాహ్నం మహ అన్నదానం నిర్వహిస్తామని, అదే రోజు రాత్రికి స్వామి, భక్తుల సమక్షంలో స్వామి, అమ్మ వార్లకు దివ్య కళ్యాణం భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహిస్తా మన్నారు. అనంతరం బాణా సంచా కాల్చుతామని లోవరాజు తెలిపారు. ప్రతీ సంవత్సరం భక్తులు, ప్రజల సహకారం, విరాళాలతోనే శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు / షష్టి మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నామని దాసరి లోవరాజు తెలిపారు.

## పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలి

**– డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖర్‌రెడ్డి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ సూచనల మేరకు మండలంలోని వడ్లమూరు గ్రామంలో శానిటేషన్ పనులను డిప్యూటి ఎంపిడిఓ శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన పర్యటిస్తూ డ్రైన్లలో ఎప్పటికప్పుడు పూడిక తీయించి, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటింటికి వెళ్ళి తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరణ నిర్వహించి, ఎస్‌డబ్ల్యూపి కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని, చెత్త, చెదారం వీధులలో వేయకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీలో హౌస్ టాక్స్ వసూళ్ళు, ఐవిఆర్ఎస్ కాల్స్, సర్వేలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ కళావతి, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## జిల్లా సర్వేయర్ల సంఘం ఇసి మెంబర్‌గా 'నిరంజనరావు'



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్** : కాకినాడ జిల్లా ఎపిఎం ఇవి జిల్లా కార్యవర్గ సమావేశం కాకినాడ పట్టణం లోని యుటిఎఫ్ భవనంలో జరిగింది. దీనిలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవ ంగా సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పెద్దాపురం పురపాలక సంఘం మున్సిపల్ సర్వేయర్‌గా విధులు నిర్వహి స్తున్న సిహెచ్.నిరంజనరావును ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నిరంజనరావును రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు సర్వేయర్లు పెద్దాపురం పట్టణంలోని పలువురు నిరంజనరావును ప్రత్యేకంగా అభినందించినవారిలో ఉన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.పి.దేవుడు, ఉపాధ్యక్షులుగా బి.రమేష్, సెక్రటరీగా పి.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా బి.శ్రీని వాసరావు, ట్రెజరర్‌గా జె.ఎస్.పద్మజ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి.రమేష్, జి.శ్రీను, పి.ప్రణయ్, ఆర్.శివదుర్గ, వి.వి.రమణ స్వరూప్, తదితరులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించినవారిలో ఉన్నారు.

## ఈ నెల 27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**పెద్దాపురం, మేజర్ న్యూస్** : ఈ నెల 27వ తేదిన ఉదయం 10.30 గంటలకు, మున్సిపల్ కౌన్సిల్ హాలు నందు కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించబడునని, కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొననున్నారని, కమీషనర్ తెలిపారు. కావున పురపాలక సంఘ వివిధ శాఖల విభాగాధిపతులు విధిగా హాజరు కావాలని, కమీషనర్ తెలిపారు.

# పోలవరం జిల్లా ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేసిన చిన్నారెడ్డి



**చింతూరు, మేజర్ న్యూస్** : చింతూరు టీడీపీ కార్యాలయంలో అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇల్లా చిన్నారెడ్డి మాట్లాడుతూ అత్యధిక గిరిజన జనాభా కలిగి కోయ కొండరెడ్ల తో కూడిన జిల్లాను దానిలో కోయ భాష ఎక్కువగా మాట్లాడే గిరిజనం ఉన్న ప్రాంతాన్ని జిల్లా ఏర్పాటు చేయడం హర్షదాయకమని అన్నారు. 2022 వరదల సమయంలో వరద బాధితులను పరామర్శించడం కోసం చింతూరు డివిజన్ కూనవరం మండలం విచ్చేసినప్పుడు పోలవరం ప్రాజెక్టు వలన ముంపుకు గురి అవుతున్న మండలాల ప్రజల బాధను చూసి.. అల్లూరి సీతారామ జిల్లా కేంద్రం పాడేరు సుదీర్ఘంగా దూరంగా ఉండటం వల్ల ప్రజలకు కష్టమని, పరిపాలన సౌలభ్యం దూరంగా జిల్లా కేంద్రం ఉండటం తో ముంపు గురవుతున్న మండలాలతో పాటు రంపచోడవరం నియోజకవర్గంలో 10 మండలాలతో పోలవరం జిల్లా చేస్తానని హామీ ఇవ్వడం, ఆ హామీని నేడు కార్యరూపం దాల్చడం పోలవరం ముంపు మండలాల ప్రజలకు ఇచ్చిన హామీ నేరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చింతూరు డివిజన్ ప్రజల తరపున కృతజ్ఞతతో కూడిన ధన్యవాదాలు తెలుపుతున్నామని, కూటమి నాయకత్వం జిల్లా ఏర్పాటు సహకారం చేసిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి. రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్, పోలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే బాలరాజుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, పోలవరం జిల్లాకు ఏర్పాటుకు సహకరించిన నాయకులకు, అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని. జిల్లా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ప్రకటన చేయడంపై వర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ నరసింహారావు, కో క్లస్టర్ రామారావు, బిసి సెల్ అధ్యక్షులు నూకచారి, యూనిట్ ఇంచార్జి లు శీలం తమ్మయ్య, శ్రీరామ్‌మూర్తి, తెలుగు యూత్ అధ్యక్షులు సురేష్ కుమార్ చౌదరి, సీనియర్ నాయకులు సయ్యద్ ఆసిఫ్, వాసా శ్రీరామ్ రెడ్డి, కట్ట శంకర్, ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ నెంబర్ కారం సత్యవతి, తెల్లం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ ప్రతి ఒక్కరికి టీడీపీలో గుర్తింపు



**- వాణిజ్య కార్యదర్శి వీర్ని శేషబాబు**

**అమలాపురం, మేజర్ న్యూస్** : పట్టణ టిడిపి పార్టీ అధ్యక్షునిగా తిక్కిరెడ్డి నేతాజీ నియామకం పట్ల దేవాంగులు వీధిలోని శ్రీ కామాక్షి జువెలరీస్ అధినేత పట్టణ టిడిపి పార్టీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వీర్ని శేషబాబు ఆధ్వర్యంలో ఘనంగా నేతాజీని సన్మానించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసంశెట్టి చినబాబు, బోనం సత్య వరప్రసాద్, భాస్కర్ల రామకృష్ణ, జంగా అబ్బాయి వెంకన్న, తాళాబత్తుల అప్పలాచార్యులు, అనుపోజు శ్రీను ఆవుపాటి వేణుగోపాల్, చింతలపూడి సత్తిబాబు, ఒంటెద్దు స్వామినాయుడు, పలివెల శ్రీను, కట్టుజో సుబ్బారావు, అమలాపురం బులియన్ వర్తక సంఘ అధ్యక్షులు ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, చవ్వాకుల కృష్ణ, యర్రంశెట్టి మూర్తి, నాయకులు రేఖపల్లి సూరిబాబు, మానేపల్లి సత్య ప్రకాష్, అల్లక వాసు, వీర్ని భీమరాజు, కర్రీ నారాయణరావు, అరిపాక బాబీ, పుల్లేటికుర్తి భాస్కరరావు, వరద సత్యనారాయణ పాల్గొన్నారు.

# మైనింగ్ దాడులకు భయపడేది లేదు





**రంపచోడవరం, మేజర్ న్యూస్** : క్వారీ బాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమ ఆగదని, గ్రామస్తులను రెచ్చగొట్టి దాడులు చేయించిన ఎమ్మార్వో, మైనింగ్ ఏడి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కుంజా శ్రీను డిమాండ్ చేసారు. రంపచోడవరం మండలం నర్సాపురంలోని నల్లరాయి క్వారీల వలన నష్టపోతున్న దిరిసనపల్లి, నరసాపురం గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరుతూ నిర్విరామంగా పోరాటం చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, నష్టపోతున్నామని ఫిర్యాదు చేస్తున్న బాధితులపై దాడులు చేయించిన మైనింగ్ మాఫియా, మైనింగ్ ఏడి, రంపచోడవరం తాసిల్దార్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, దాడి చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటీడీఏ ముందు నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ. బినామీ పేరుతో క్వారీ నడిపిస్తున్న మైనింగ్ మాఫియా స్థానిక అధికారులు ఎమ్మార్వో, మైనింగ్ డిపార్ట్మెంట్ మైనింగ్ ఏడి కుమ్మక్కై ఫిర్యాదులు చేస్తున్న బాధితులపై, బాధితులకు అండగా ఉన్న ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులపై దాడులు చేయడానికి ప్రోత్సహించారని, అందులో భాగంగానే సోమవారం విచారణలో భాగంగా దిరిసినపల్లి గ్రామానికి వచ్చిన ఎమ్మార్వో, మైనింగ్ ఏడి, కొంతమంది అధికారులు ఫిర్యాదుదారులు ఇళ్లు చూసి ఫోటో తీసి వెళ్లకుండా ముందుగా మైనింగ్ మాఫియాతో చర్చించుకుని కొంతమంది గ్రామస్తులకు మందు పోయించి ఫిర్యాదుదారులపై, ఆదివాసీ నాయకులపై దాడులు చేయాలని ప్లాన్ ప్రకారమే గ్రామస్తులను రెచ్చగొట్టి వెళ్లిపోయారన్నారు. అనంతరం గ్రామంలో కొంతమంది తాగిన వారు ఆడవారిని రెచ్చగొట్టి ఫిర్యాదురాలు, వారికి అండగా నిలిచిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులపై విచక్షణ రహితంగా దాడి చేయడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. నిరంతరం ఆదివాసి హక్కుల కోసం చట్టాల పరిరక్షణ కోసం, ఆదివాసి ఐక్యత కోసం పోరాటం చేస్తున్న మాలాంటి నాయకులపై దాడి చేయడం అంటే ఆదివాసులు వారు కూర్చున్న కొమ్మను వారు నరుక్కున్నట్లేనని ఆయన హితవు పలికారు. ఇక దాడి చేసిన వారు దాడి చేయించినవారు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. నరసాపురం మెటల్ క్వారీ వలన జరుగుతున్న నష్టానికి బాధితులకు తగు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని. ఆ క్వారీల పేరుతో జేబులు నింపుకుంటున్న అధికారులకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, డివిజన్ ఉపాధ్యక్షురాలు బోరగ ఎర్రమ్మ, డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, నాయకులు కంగాల అబ్బాయి దొర, కలుముల ప్రసాద్ దొర, చోడి ఏడుకొండలరావు, బల్లెం గంగాభవాని, పోడియం అరుణకుమారి పాల్గొనగా భారత ఆదివాసి పార్టీ నాయకులు పండ కృష్ణమూర్తి, మద్దేటి అంజిరెడ్డి మద్దతు తెలియజేశారు.

## ఆధునిక సాగు పద్ధతులు అవలంబించాలి



**శంఖవరం, మేజర్ న్యూస్** : రైతులు అందరూ ఆధునిక సాగు పద్ధతులును విధిగా అవలంబించాలని శంఖవరం మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ సూచించారు. రైతన్నా.... మీకోసం కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అరెంపూడి, నెల్లిపూడిలో బృంద సభ్యులు చేపడుతున్న కార్యక్రమాన్ని పర్యవేక్షించి రైతులకు నీటి సంరక్షణ, డిమాండ్ ఆధారిత సాగు పద్ధతులు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ఫుడ్ ప్రోసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి అంశాల గూర్చి వివరించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేం ద్రాల పరిధిలోని క్లస్టర్లలో రైతన్నా...మీకోసం కార్యక్రమాన్ని శని వారం వరకు నిర్వహిస్తామని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులు జగదీశ్,రాజు,బృంద సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

## నాణ్యతలేని ఆభరణాలకు హాల్ మార్క్ ముద్రణ

**- కాకినాడలో ఘరానా మోసం..**



**కాకినాడ, మేజర్ న్యూస్** : బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు తప్పనిసరిగా హాల్ మార్క్ గుర్తింపు చిహ్నం చూసి కొనుగోలు చేస్తారు. ఈ చిహ్నం వినియోగదారులకు నమ్మకం కలిగిస్తుంది. హాల్ మార్క్ ఉంటే స్వచ్ఛమైన బంగారు ఆభరణాలు నిరభ్యంతరంగా కొనుగోలు చేయవచ్చు. కాకినాడ దేవాలయం వీధిలో ఒక షాపులో నాణ్యత లేని బంగారు ఆభరణాలపై కేవలం వందల రూపాయలకే హాల్ మార్క్ వేస్తున్న దుకాణంపై బిఎస్ఐ అధికారులు దాడులు చేసి యంత్ర పరికరాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. బిఎస్ఐ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జాయింట్ డైరెక్టర్ టీ.అర్జున్, ఇతర అధికారులు బృందం మంగళవారం సాయంత్రం దాడులు చేసి యంత్ర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులు ఆభరణాలను కొనేముందు నాణ్యత తప్పనిసరిగా చూసుకోవాలని సూచించారు.



## హర్షం వ్యక్తం చేసిన ఎస్టీ కమిషన్ సభ్యురాలు

**రంపచోడవరం, మేజర్ న్యూస్** : రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత ధన్యవాదములు తెలిపారు.

## మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి

**- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి విన్నవించుకున్న మహిళలు**



**గండేపల్లి, మేజర్ న్యూస్** : తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గండేపల్లి మండలం సింగరం పాలెం గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం తమ గ్రామం బీటీ రోడ్డు శంకుస్థాపన నిమిత్తం చేసిన స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతి పత్రం ద్వారా విన్నవించుకున్నారు. వినతి పత్రం అందుకున్న జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గతంలో సింగరం పాలెం టు రాజమండ్రి బస్సు వచ్చేదని రాను రాను ఆటో సౌకర్యాలు పెరిగి బస్సు రావడం తగ్గింది అన్నారు. అయితే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించిందని ఆ సౌకర్యం ఈ ప్రాంత మహిళలకు కూడా అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గోకవరం టు రాజమండ్రి బస్సు వచ్చే విధంగా చూస్తామని తద్వారా శింగరం పాలెం, రామయపాలెం మీదగా బస్సులో మహిళలు ప్రయాణించవచ్చునున్నారు. మహిళల కాకుండా మగవారికి కూడా రానుపోను సౌకర్యం బస్సు రావడం ద్వారా అందిస్తామన్నారు. ఈ బస్సు సౌకర్యం అందే విధంగా చదివి తీసుకుంటామని మహిళలకు హామీ ఇచ్చారు. గ్రామ నాయకులు, మహిళలు ఉన్నారు.

# టిడిపి గూటికి భారీగా వైసీపీ నాయకులు




– పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి సుభాష్

– సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్, మంత్రి సుభాష్ పనితీరుతో మా మనసులు మారాయి..

– వైసిపి ఇన్చార్జ్ వైఖరితోనే రాజీనామాలు

**రామచంద్రపురం, మేజర్ న్యూస్** : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె.గంగవరం మండలంలో వైఎస్ఆర్సిపి కి పెద్ద షాక్ తగిలింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు మంగళ వారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని మంత్రి సుభాష్ తెలుగుదేశం పార్టీ కండువాను కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళ తీసింది అని, ఆ నష్టాలను పూరించి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో రాజీ పడకుండా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారంతా క్రమశిక్షణ, ఐకమత్యంతో మిగిలిన నాయకులను కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవిల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, పలువురు కూటమి పార్టీ నాయకులు ఉన్నారు.

వైసీపీ ఇన్చార్జి వైఖరితోనే రాజీనామా..

సీఎం చంద్రబాబు విజన్, మంత్రి సుభాష్ పనితీరు బాగా నచ్చింది

రామచంద్రపురం నియోజవర్గం వైసీపీ ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ అవలంబిస్తున్న వైఖరి, ఒంటెద్దు పోకడలను సహించలేక పార్టీకు రాజీనామా చేసి మంత్రి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు కె.గంగవరం మండల, రామచంద్రపురం నాయకులు వెల్లడించారు. వైసీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సరైన గుర్తింపు, గౌరవం లేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ పనితీరు తమను ఆకట్టుకున్నాయని ఇకనుంచి మంత్రి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కోసం పని చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రకటించారు. తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో కుడుపూరు గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు, గుడిగండ్ల గ్రామ సర్పంచ్ పిల్లి దొరబాబు, తాళ్లపూడి, పేకేరు ఎంపీటీసీ కోట రామకృష్ణ, కూళ్ల ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, గంగవరం మండలం వైఎస్ఆర్సిపి యువజన సంఘం అధ్యక్షులు జుత్తుక శ్రీనివాస నాగేంద్రప్రసాద్, పేకేరు నుంచి చిట్టూరి శ్రీనివాస్, రామచంద్రపురం 20వ వార్డు నాయకుడు సూరంపూడి సుబ్రహ్మణ్యం తదితరులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

# పట్టుచీర గ్రామంలో రైతన్న మీకోసం ఇంటింటా కార్యక్రమం



**ఎటపాక, మేజర్ న్యూస్** : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి సూచనల మేరకు అన్నదాత సుఖీభవ రెండవ విడత రైతుల ఖాతాలో డబ్బులు జమకావడం జరిగింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 17 నెలల వ్యవధిలో సూపర్ సిక్స్ హామీలలో అన్నదాత సుఖీభవ ఒక పథకం దాన్ని రెండు విడతలుగా రైతులు ఖాతాలో ఇప్పటివరకు 14 వేల రూపాయలు జమ చేసి వారికి ఆర్థిక సాయంగా రైతులకు అందించడం కూటమి ప్రభుత్వం లక్ష్యం అని, రానున్న 5 సంవత్సరాలలో రైతే రాజు అనే నినాదంతో రైతు అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త కార్యచరణ అమలు చేస్తుందని లక్ష్మీపురం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కణితి మధు, ఉండేటి రమేష్, మాజీ సర్పంచ్ పెనుబల్లి సీతయ్య, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి ఐసీడీఎస్ సూపర్వైజర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మడకం లక్ష్మి, మడివి కాంతమ్మ, పెనుబల్లి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన చైతన్యం 4.0 ప్రచార కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్** : లింగ అసమానత్వ సమస్యలు ఎదుర్కొనేందుకు నూతన చైతన్యం 4.0 ను "మార్పు కోసం ముందడుగు" వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందు ఉండాలనే నినాదంతో జిల్లాల స్థాయిలో జెండర్ కార్యక్రమములు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.శ్రీనివాసురావు అన్నారు. నూతన చైతన్యం 4.0 ప్రచారాన్ని మంగళవారం న్యూఢిల్లీ నుంచి వ్యవసాయ మరియు రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వర్చ్యువల్ గా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి కాకినాడ గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసురావు.. జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బందితో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా లింగ అసమానత్వ సమస్యలను ఎదుర్కొనే లక్ష్యంతో ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నూతన చైతన్యం 4.0 "మార్పు కోసం ముందడుగు" వికసిత గ్రామీణ భారతదేశ గా సమ్మిళిత వృద్ధికి ఆర్థిక సాధికారతకు మహిళలే ముందుండాలనే నినాదంతో జిల్లాలో లింగ సమానత్వంపై ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ మరియు సంఘ స్థాయిలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రాముఖ్యంగా పంచాయత్ రాజ్, స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, యూత్ వెల్ఫేర్, పాఠశాల విద్యా, సాంఘిక సంక్షేమం, పౌర సంబంధాలు, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ (సిఎస్వో) ల సమన్వయంతో జిల్లా సమాఖ్య వారితో జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా జిల్లా లోని అన్నీ మండలములలో నేటి నుంచి నెల రోజుల పాటు వివిధ కార్యక్రమములు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడం జరిగిందన్నారు. నూతన చైతన్యం 4.0 కార్యక్రమంలో ద్వారా మహిళా సంఘములలో అనగా గ్రామ మండల తో పాటు అంగన్వాడి, పాఠశాలలో లింగ అసమానతలు, హింస, వివక్షపై అవగాహన పెంపుబీ మహిళల సురక్షిత గమనాన్ని (సేఫ్ మొబిలిటీ) ప్రోత్సహించడం. కుటుంబం మరియు సమాజంలో మహిళల ఆర్థిక సహకారదారులుగా గుర్తింపు పెంపు, మహిళల గృహ సంరక్షణ పనులను గుర్తించడం, పునర్విభజనబీ వనరులపై మహిళల ప్రవేశం మరియు నియంత్రణకు ప్రోత్సాహం, జెండర్ ఆధారిత వివక్ష మరియు హింసను తగ్గించడం కోసం మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడం వంటి ప్రధాన లక్ష్యాలను దృష్టి సారించడం జరుగుతుందని డీఆర్డిఏ పీడీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీడి ఎంఎం.జిలాని, డీపీఎంలు, అన్ని మండలాల జిల్లా సమైక్య సభ్యులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్య షష్టి చూసొద్దాం రండి

– ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : మండల కేంద్రం ఆత్రేయపురంలో వేంచేసియున్న సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి తీర్థ కళ్యాణ మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం అభిషేకాలు తీర్థం సాయంత్రం గ్రామోత్సవం రాత్రి శ్రీ వల్లి దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఎలమర్తి నాగబాబు తెలిపారు. అలాగే మండలంలోని పేరవరం వాడపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది.

# ఆత్రేయపురంలో అగ్నిప్రమాదం

– మూడు లక్షలు ఆస్తి నష్టం




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : మండల కేంద్రం ఆత్రేయపురం చిన్న పేటలో సోమవారం అర్ధరాత్రి ఒక తాటాగిళ్ళు దగ్ధమయింది. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించినట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో మమ్మీ శాంతకుమారికి చెందిన తాటాకిల్లు దగ్ధం కాగా మూడు లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామానికి చెందిన వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరు వెంకట్ రాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజులు బాధిత కుటుంబాలను పరామర్శించి పదివేలు నగదు, 25 కేజీలు బియ్యం అందించారు. అలాగే ప్రభుత్వం నుండి వచ్చిన 25 కేజీలు బియ్యాన్ని తాసిల్దార్ రాజేశ్వరరావుతో కలిసి అందించారు. ప్రమాద వివరాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఫోన్ లో బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల దేవస్థానం చైర్మన్ వేగేసిన ప్రసాదరాజు, ముదునూరి రాంబాబు తదితరులు ఉన్నారు.

# బస్టాండ్‌కు వృద్ధాల నిమిత్తం డస్ట్ బిన్‌లను అందజేసిన అవంతి ఫౌండేషన్




**రావులపాలెం, మేజర్ న్యూస్** : ప్రయాణికుల సౌకర్యార్థం డస్ట్ బిన్లును అందజేసిన అవంతి ఫౌండేషన్ మండలం పరిధిలోని ఈతకోట అవంతి ఫౌండేషన్ వారు ఏపీఎస్ఆర్టీసీ రావులపాలెం బస్టాండుకు ప్రయాణికుల సౌకర్యార్థం సుమారు 75 వేల రూపాయలు విలువ గల 15 డస్ట్ బిన్లను సోమవారం అవంతి హెచ్ ఆర్ ప్రసాద్ చేతులు మీదుగా రావులపాలెం డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్‌కి అందజేశారు. ఈ సందర్భంగా అవంతి ఫౌండేషన్ వారు అందించిన సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎం.గురవయ్య నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ ఎం. అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.